క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎర్రగుట్ట గ్రామానికి చెందిన ఎర్మ వినోద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి, రూ. 5వేలు ఆర్థిక సాయం అందచేశారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సముద్రాల రాజన్న, చంద్రమౌళి, గంగారాం, మహేశ్, తిరుపతి, వెంకటేశ్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

అగర్‌గూడలో పంట నష్టం సర్వే


సర్వే చేస్తున్న ఏఈవో శ్రీవిద్య

పెంచికల్‌పేట్: పెద్దవాగు వరదలతో నష్టపోయిన పంటలను బుధవారం ఏఈవో శ్రీవిద్య పరిశీలించి, సర్వే చేశారు. రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంట నష్టం సర్వే నిర్వహిస్తున్నామని, నష్ట పోయిన పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మాదకద్రవ్యాల అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగంతో జరుగుతున్న నష్టాలను వివరించారు. మత్తురహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. సైబర్ క్రైం మోసాలను తెలియచేశారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, శ్రీకాంత్, సాయిలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం


సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న మచ్చగిరి నరేందర్‌కు ఏజీఎంగా పదోన్నతి లభించడంతో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, ఎస్‌వోఎం శంకర్, వెల్ఫేర్ అధికారి రజినికుమార్, అధికారులు, క్లరికల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటిగోడ

రెబ్బెన: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఖైరిగాం గ్రామానికి చెందిన తుమోజు శ్రీనివాస్‌కు చెందిన ఇంటి గోడ మంగళవారం రాత్రి కూలిపోయింది. సంఘటన సమయంలో బాధితుడు పక్కింట్లో ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో ఇంటి పైకప్పు పెంకులు, వాసాలు, దూలాలు దెబ్బతిన్నాయని, రూ.30 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ సౌమ్య సంఘటన స్థలానికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నట్లు తెలిపారు.

మండపాల వద్ద అన్నదానం


ద్వారకానగర్‌లో అన్నదానం చేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్‌లోని టీచర్స్ కాలనీ, ద్వారకానగర్‌లోని యువజన గణేశ్‌మండలిలో మహిళ కమిటీ ఆధ్వర్యంలో, ఇందిరా మార్కెట్, మారుతినగర్‌లో గణేష్‌నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. అంతకుముందు మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఇంకెన్నాళ్లీ దారి కష్టాలు..!

- అభివృద్ధికి ఆమడ దూరంలో 'లోహ'
- వర్షాలకు కోతకు గురైన రోడ్డు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కోతకు గురైన గ్రామానికి వెళ్లే రోడ్డు


లోహ గ్రామం

లోహ గ్రామం వివరాలు..	
కుటుంబాలు	30
గిరిజన జనాభా	150

దహెగాం: ప్రభుత్వాలు మారినా.. గిరిజనుల తలరాత మాత్రం మారడం లేదు. దట్టమైన అడవి కొండల మధ్య ఉన్న లోహ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. అత్యవసర సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వారికి ఎడ్లబండే దిక్కు. కనీసం అంబులెన్స్ కూడా వెళ్లాలేని పరిస్థితి. ఉన్న మట్టి రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. దీంతో దారి కష్టాలు ఇంకెన్నాళ్లీ అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 కుటుంబాలు..150 జనాభా..

లోహ గ్రామంలో 30 కుటుంబాలు, 150 జనాభా ఉంటుంది. మండలంలోని కర్జి వరకు రోడ్డు సౌకర్యం ఉంది. కర్జి గ్రామం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో లోహ గ్రామం ఉంటుంది. ఎత్తైన కొండల మధ్య ఉండడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు రోడ్డంతా బురదగా మారడంతో పాటు కోతకు గురై రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇటీవల రోడ్డు కోతకు గురి కావడంతో ప్రయాణం నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సరిగా వీధి దీపాలు వెలుగవు. పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



అడవులు, కొండల మధ్య నివసిస్తున్నాం. గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నది మట్టి రోడ్డు వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారుతుంది. ఎన్నికల సమయంలో లీడర్లు వచ్చి సమస్యలు తీరుస్తామని హామీలిచ్చి, అనంతరం విస్మరిస్తున్నారు. **– కుద్మెత వెంకటేశ్, లోహ గ్రామం**

రోడ్డు మంజూరు చేయాలి



కర్జి నుంచి లోహకు ఆరు కిలో మీటర్ల దూరం ఉంది. దట్టమైన అడవి నుంచి మట్టి దారి ఉంది. అత్యవసర సమయంలో ఏదైనా ఆపద వస్తే అంతే సంగతి. రేషన్ బియ్యం కోసం కాలినడకన కర్జికి వెళ్లి తీసుకువస్తాం. అధికారులు స్పందించి రోడ్డు మంజూరు చేయాలి. **– తలాండి సుమలత**

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి ఎంపీడీవోలు, ఉపాధిహామీ పథకం ఏపీవోలు, సెర్ప్ ఏపీఎంలు, హౌసింగ్ ఇంజనీర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వందశాతం ప్రారంభించాలన్నారు. పీఎం జన్ మన్ పథకం కింద పీవీటీజీలకు వందశాతం ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలన్నారు. ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రోత్సహించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ దత్తారావ్, డీపీవో భిక్షపతిగౌడ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాంకిడి: విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని ప్రిన్సిపాల్ కనకయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను రూపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. జూనియర్లను ప్రోత్సహిస్తూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యకలాపాల్లో సమాన ప్రాధాన్యం కల్పించాలన్నారు. దీంతో భవిష్యత్‌లో మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్ డే సందర్భంగా విద్యారంగంలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి బుధవారం సన్మానించారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, అధ్యాపకుడు రామకృష్ణ, జెడ్పీహెచ్‌ఎస్ హెడ్ మాస్టర్ వెంకట రాజయ్య, రిటైర్డ్ టీచర్ రాపెల్లి రాజేశ్వర్ రావులను శాలువాలతో సన్మానించారు. ఎంఈవో వాసాల ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దత్తాత్రేయ, అధ్యాపకులు దేవేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఉమర్

తిర్యాణి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో ఉమర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయడంతో పాటు ఫాగింగ్ చేయాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్తులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయాలన్నారు. వైద్య, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వేముల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్సైకి నివాళి


నివాళులర్పిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్ గ్రామానికి చెందిన ఏఆర్ ఎస్సైగా పని చేస్తున్న జగదీశ్ మండల్ (55) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. కాగా బుధవారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మృతి చెందిన ఏఆర్‌ఎస్సై భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జగదీశ్ చంద్రమండల్ 1993 ఉద్యోగంలో చేరి 32 యేండ్ల సర్వీసులో హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఆర్‌ఎస్సైగా పదోన్నత పొంది అత్యుత్తమ సేవలందించారు. కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 30వేల ఆర్థిక సాయం అందించారు. వీరి వెంట ఆర్‌ఐ అడ్మిన్ పెద్దన్న, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ్ శంకర్‌రెడ్డి, రూరల్ సీఐ కుమారస్వామి, అంజన్న, ఎస్సై కల్యాణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు ఆనందంగా జరుపుకోవాలి


అన్నం వడ్డిస్తున్న ఎస్సై సర్తాజ్ పాషా

బెజ్జూర్: పండుగలను ఆనందంగా జరుపుకోవాలని బెజ్జూర్ ఎస్సై సర్తాజ్ పాషా అన్నారు. మండలంలోని మర్తిడి, బెజ్జూర్ ఎస్సీ కాలనీలో వినాయక మండపాల వద్ద ఎస్సై సర్తాజ్ పాషా అన్నదానం చేశారు. వినాయక మండపాల వద్ద భక్తులకు ఎస్సై అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పండుగలను కలిసిమెలిసి సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పాలఘోరీలలో అలజడి

- చెట్లు నరికిన ఆదివాసీలు
- కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు


గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

జన్నారం: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్, జైనూర్ ప్రాంతాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ సెక్షన్‌లోని పాలఘోరీల ప్రాంతంలో గుడిసెలు వేసుకొని నెల రోజులుగా నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి చెట్లు నరికివేసి అలజడి సృష్టించారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. టేకు, నాన్ టేకు చెట్లు సుమారు 52చిన్నవి నరికివేసినట్లు ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు. అడ్డుకున్న సిబ్బందిని తోసేసినట్లు, ప్రాంతం ఖాళీ చేయాలని తెలిపినా వినడం లేదని పేర్కొన్నారు. లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి ఆదివాసీ గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అడవిలో ఉంటూ చెట్లు నరికివేయడం చట్ట ప్రకారం నేరమని, శాంతియుతంగా, చట్ట పరిధిలో సమస్య పరిష్కారం చేసుకోవాలని సూచించారు. చెట్ల నరికివేతకు పాల్పడిన 40మందిపై కేసులు చేశారు. కానీ భూమి తమదేనని, భూమి మాకు దక్కే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని గిరిజనులు భీష్మించుకు కూర్చున్నారు.

వాట్సాప్‌లో విద్యుత్ సేవలు

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యుత్ వాట్సాప్ చాట్‌బాట్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆ శాఖ ఎస్‌ఈ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ వాట్సాప్ ద్వారా 790 16 28348 నంబర్‌కు హాయ్ అని సందేశం పంపగానే వివిధ ఆప్షన్లు వస్తాయన్నారు. కంప్లైంట్, ఫాలో అప్, అదనపు సదుపాయాలు ఉంటాయని, యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేస్తే ఫిర్యాదుకు సంబంధించిన విభాగాల మెనూ కనిపిస్తుందన్నారు. అధికారిక వెబ్‌సైట్‌లోనూ వాట్సాప్ ఐకాన్ అందుబాటులో ఉంటుందని, టోల్‌ఫ్రీ నం.1912 ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకాల అమలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఏపీవో రాజన్న, ఈసీ రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గణనాథునికి ఘనంగా పూజలు


సాయినగర్‌లో..


కెరమెరి: జ్యోతినగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


రెబ్బెన: పూజల్లో పాల్గొన్న తహసీల్దార్ సూర్య ప్రకాష్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గణనాథులకు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం సాయినగర్‌లోని ఓంసాయి గణేశ్ మండలి వద్ద నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సీఐ బాలాజీ వరప్రసాద్, అరిగెల నాగేశ్వర్‌రావ్, విశ్వప్రసాద్‌రావ్ పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు శంకర్, ఖాండ్రె విశాల్, దీపక్, సభ్యులు కిషన్‌గౌడ్, ప్రదీప్, మహేష్, సంతోష్, శ్రీనివాస్, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: ఎనిమిది రోజులుగా వినాయకుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. ఊరూవాడ భక్తి భావం ఉప్పొంగుతోంది. అన్ని గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణ నెలకొంది. వినాయక మండపాల్లో ప్రతిష్ఠింపజేసిన గణపతుల వద్ద భక్తులు నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని బెస్తవాడ, శివాలయం, సేవాదాస్ నగర్, విద్యానగర్, నెహ్రూ నగర్, చందుగూడ జ్యోతినగర్, గోయగాం, కల్లెగాం, రాంనగర్, సుర్దాపూర్‌లో భక్తులు బుధవారం నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు.

రెబ్బెన: గోలేటి పంచాయతీ పరిధిలోని రమణారెడ్డి నగర్‌లో బాల గణేశ్ మండలి వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సూర్యప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి సీహెచ్‌పీలోని కనకదుర్గాదేవి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాధుడికి మహిళలు కుంకుమపూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌ఐ ఉదయ్‌కిరణ్, సీనియర్ అసిస్టెంట్ ప్రేం కిరణ్, భక్తులు రాయిల్ల నర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాచకొండ క్రిష పాల్గొన్నారు.


నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

101 ప్రసాదాల నైవేద్యం

తిర్యాణి: మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠించిన గణేశుడికి భక్తులు 101 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. కొన్నేళ్లుగా 101 రకాల ప్రసాదాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

సమాజ అభివృద్ధిలో గురువులే కీలకం


కేక్‌కట్ చేస్తున్న కరస్పాండెంట్, విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్: సమాజ అభివృద్ధిలో గురువులే కీలకమని సరస్వతీ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ రాజమౌళి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి నిర్వహించారు. కళాశాల విద్యార్థులు గురువులను సన్మానించారు. అనంతరం విద్యార్థులు కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిరత్‌కర్, రవికాంత్, అధ్యాపకులు ప్రేమలత, పద్మవతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి వెళ్లే అటవీ ప్రాంతంలో బుధవారం యువకులు ద్విచక్రవాహనాలు ఢీకొని రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. భూపాలపట్నానికి చెందిన మహేశ్ అనే యువకుడు, మొండి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యా యి. స్థానిక ప్రయాణికులు గమనించి ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లపొదలు పెరగడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన అఖిల్ సింగ్, నాగ చైతన్య అనే విద్యార్థులు యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు మార్త రమేశ్, రాంచందర్, రయీస్ అహ్మద్, శ్యాంరావ్ పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం చేయాలి


మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి: గణపతి నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండలి నిర్వాహకులతో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. శోభాయాత్రలో ఎలాంటి అల్లర్లు చేయకూడదని, మసీదుల వద్ద పెద్ద పెట్టున నినాదాలు వద్దన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రశాంతంగా నిమజ్జనం చేయాలన్నారు.

హట్టిలో 'సైబర్ జాగృత్ దివస్'


మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి: మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో 'సైబర్ జాగృత్ దివస్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్.మధుకర్ మాట్లాడుతూ ఫేక్ ప్రొఫైల్, ఫేక్ కస్టమర్ సర్వీస్, తదితర విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే ఎత్తకూడదన్నారు. బ్యాంకు ఖాతాలు, ఓటీపీ నంబర్లు తెలపవద్దని సూచించారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు


విద్యార్థులతో యోగా చేయిస్తున్న దొడ్డాజీ

వాంకిడి: నిత్యం యోగా అలవాటు చేసుకున్న వారిలో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా నిపుణుడు వి.దొడ్డాజీ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో బుధవారం ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సూర్య నమస్కారంలోని 12 భంగిమలు, ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ కల్పించడం జరుగుతుందని, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.